
# పర్యావసానం



"కృష్ణా, నీకు నా ముద్దులు. ఇంతే సంగతులు." ఇదే వరుస.

అది ఆమె దగ్గరినుంచి వచ్చిన ఆరో ఉత్తరం. ప్రతి నెల ఒక ఉత్తరం అయినా తప్పక వ్రాస్తుంది. ఈ ఉత్తరం ఎక్కడినుంచి వచ్చిందా అని కవరుమీద ముద్ర చూశాను. ఏదో పల్లెటూరునుంచి. అసలు విచిత్రం ఏమిటంటే నేను ఏ ఉత్తరానికీ సమాధానం వ్రాయలేదు. ఆమెకు నా సమాధానంతో నిమిత్తం లేదు. తన అడ్రసుగూడా ఇవ్వదు. నేను ఒక బందీని. నాకు నేనే నియమాలు పెట్టుకున్నాను. ప్రపంచానికి వీలు అయినంత దూరాన ఉండాలని ఒక మారుమూల పల్లెటూరులో ఒక గుడిసె వేసుకొని ఉంటున్నాను. దాన్నే ఆశ్రమం అన్నారు ప్రజలు. దానంతట అదే పెరిగిన గడ్డం కూడా నాకు కొంత సాహాయ్యం చేసింది. నేను ఒక స్వాములవారినయ్యాను. ఈ మధ్య నా దగ్గరకు జనం రావటం ఎక్కువయినది. రోగాలని, దయ్యాలని, నేను ఏదో వాటిని బాగుచేసిపెట్టాలని ఒకటే గొడవ. నేనుమాత్రం ఏమి చేస్తాను? ఊఁకొడుతూ వారి కథలను వింటూ ఉండేవాడిని. నిజంగా కొందరి దుఃఖ చరిత్రలు వింటూంటే నాకు భగవంతుడు వాళ్ళను ఉద్ధరించే శక్తి ప్రసాదిస్తే ఎంత అయినా బాగుండును అని అనుకుంటూ ఉండేవాడిని. నేను ఏమీ మాట్లాడేవాడినికాను. దానితో నన్ను కొంతమంది మౌనానందస్వామి

*అశాంతికి గురికావడం బలహీనతకు తార్కాణం. అంతటి సహజమైన పరిణామం మాత్రం అరుదు. అశాంతి దహిస్తుంది; అశాంతికే దారితీస్తుంది; అయినా శాంతికి అశాంతికన్న మార్గాంతరం లేదంటే అంతగా ఆశ్చర్యపడవలసిన పనిలేదేమో!*

అని అన్నారు. నాకు నవ్వువచ్చి నవ్వుకొన్న సమయాల్లో కొందరు భక్తులు నా నవ్వులకు ఎన్నో వ్యాఖ్యలు కల్పించారు. ఇంతకూ ఇంద్రియాలను జయించాలనే తీరని కాంక్షతో నేను నామీద చాలా నిబంధనలు విధించుకొన్నాను. లోపల లోపల ఆమెకు ఉత్తరము వ్రాయాలని ఎంత వాంఛ ఉన్నా తీవ్ర కృషివల్ల నన్ను అదుపులో ఉంచుకొన్నాను. కాని ఎంతకాలం ఈ నాటకం? ఈ రోజుతో దీనికి స్వస్తి చెప్పాలి. ఛా, ఛా! యిది ఏమి బుద్ధి, ఇంత పెడతల పట్టింది? ఇంత వరకు గాయత్రీ అనుష్ఠానంగూడా చెయ్యలేదు. బండి పట్టాలు తప్పటం లేదుకదా!

ఉత్తరం వచ్చింది గురువారం; ఈ రోజు సోమవారం. సోమవారం ఉదయంతో దిన పత్రిక; దానితో ఆమె మరణవార్త—నిజంగా నన్ను నేను నిలువరించుకోలేకపోయాను. కండ్ల వెంబడి వచ్చే నీరు ఎంత ప్రయత్నించినా ఆపుకోలేకపోయాను. నేను నిజంగా ఓడిపోయాను. నన్ను బ్రతికి ఉండినప్పుడు జయించలేని లీల చనిపోయి జయించింది. దుఃఖం అంటే ఏమిటో, దాని ఉద్వేగం ఏమిటో ఇప్పుడు తెలిసివచ్చింది.

ఆత్మీయతలోని ఆంతర్యం, అనుబంధంలోని బంధం లీలను ఈ జన్మలో ఇక చూడలేను అని అనుకోగానే తెలిసివచ్చింది. లీల ఒక డాక్టరు. ఎంతగానో చదివేది. అనేక విషయాలను అర్థం చేసుకొని చర్చించేది. ఆమెకు ఎవ్వరూ నచ్చరు. నిజంగా ఆమె స్వతంత్రురాలు. లీల తను నమ్మిన ప్రతి సిద్ధాంతాన్నీ ఆచరణలో పెట్టేది. విధి వశాత్తు నేను ఎప్పుడూ ఆమెకు తీవ్ర వ్యతిరేకినే. ఆమె అట్లా పెరిగిందంటే ఆమె తల్లి తండ్రులే కారణం. తల్లి మేరీ వర్జీనియా. పుట్టింది హరిజనుగా. కాని పెరిగింది క్రీస్టియనుగా. తండ్రి శాస్త్రి. నేను విశాఖపట్టణంలో లా చదువుతుండే రోజులలో నాకు వాళ్ళు బాగా పరిచయమయ్యారు. మేరీ డాక్టరు. శాస్త్రి మాకు ఉపన్యాసకుడు. చదువుకునే రోజులలో అమెరికాలో ప్రేమించుకొని, వివాహం చేసుకొని ఇండియాకు దిగుమతి అయ్యారు అని అంటూండేది లీల తన సహజ ధోరణిలో. సాధారణంగా వచ్చే ఉపన్యాసకులకు, శాస్త్రికి చాలా తేడా ఉండేది. శాస్త్రిలో విభిన్న దృక్పథాలను సమన్వయపరిచే అద్భుత శక్తి ఉంది. సన్నగా, పొడుగ్గా ఉంటాడు శాస్త్రి. మతతత్వం, కులతత్వం పోతేకాని జాతి అభివృద్ధి కాదని, దేశానికి స్వాతంత్ర్యం రాదని నిజంగా నమ్మి మతాంతర వర్ణాంతర వివాహాన్ని చేసుకొన్నాడు. అది గాంధీజీ ప్రభావం. కాని మేరీ దృక్పథం వేరు. ఆమెకు ఈ ఆశయాలంటే నమ్మకం లేదు. పైగా పెండ్లి చేసుకొనే విషయంలో ఏదో త్యాగాన్ని చేశాననే శాస్త్రి అవ్యక్త అభిప్రాయం అంటే ఆమెకు తగని చిరాకు. శాస్త్రి ఆమెకు కావాలి. శాస్త్రికోసం కొంతకాలం ఆమె త్రాగటం మానేసింది. మాంసం తినటంగూడా మానేసింది. అసలు శాస్త్రి బ్రాహ్మణుడా, నీగ్రోయా, ముస్లిమా అనే ప్రసక్తి మేరీ దృష్టిలో కేవలం అనవసరం. వివాహం అనేది గూడా అంత తప్పనిసరిగా చేసుకో నవసరం లేదంటుంది మేరీ. తార్కికంగా ఆ సిద్ధాంతానికి తల ఒగ్గినా మానసికంగా ఒప్పుకోలేడు శాస్త్రి.

వారిరువురి సంతానం లీల. లీలకు పూర్తి స్వాతంత్ర్యం సహజంగానే వచ్చింది. స్వాతంత్ర్యం అనేది ఆమె స్వంతం. ఆ రోజుల్లో ఏదో పార్టీకి ఆహ్వానించటానికి వెళ్లాను శాస్త్రి యింటికి. లీలతో అప్పుడు పరిచయమయింది. తరువాత తరువాత వాళ్లందరికి నేను ఆంతర్యుణ్ణి అయిపోయినాను. ఒక్కొక్కరూ వారి వారి అభిప్రాయాలు నాకు ప్రత్యేకంగా చెప్పుతూ ఉండేవారు. నాకు తగని ఆశ్చర్యం వేసేది ఏ కారణంవల్ల యింకా మేరీ, శాస్త్రీ విడిపోలేదా అని! కారణం అప్పుడు తెలియలేదు కాని యిప్పుడు తెలిసింది. కారణం లీల. లీలను విడిచి వారిద్దర్లో ఏ ఒక్కరూ ఉండలేరు. మరి ఇప్పుడో? వాళ్లను ఓదార్చవలసిన అవసరం ఎంత ఆయినా ఉన్నదని వెంటనే బయలుదేరాను.

నన్ను చూడటంతోనే యిద్దరూ బావురుమన్నారు. "ఎట్లా చనిపోయింది? ఏమిటి?" అని అడిగాను మౌనవ్రతం మంటకలిపి.

మేరీ చెప్పటం మొదలుపెట్టింది: "నీకు తెలుసుగా కృష్ణా, అమ్మాయి తత్వం? అది ఏ కుర్రవానితో షికారుకు వెళ్లినా మేము ఏమి అభ్యంతరం పెట్టాము? అయినా చెప్పకుండా నెల రోజుల క్రిందట వెళ్లిపోయింది. వారం రోజుల క్రిందట మాకు ఒక ఉత్తరం వ్రాసింది—రెండు రోజులలో వస్తూ ఉన్నానని. నిజంగా సంతోషంతో మేము తబ్బిబ్బు అయినాము. మేమే పోదాము అంటే తన అడ్రసు ఇవ్వలేదు. కాని మరుసటిరోజే తంతి వచ్చింది. మేము ఇద్దరం వెంటనే విజయవాడ వెళ్లాము. అక్కడ ఒక నర్సింగు హోములో ఉన్నది. మేము వెళ్ళిన పది నిమిషాల్లోనే పోయింది." ఏడవటం మొదలుపెట్టింది మేరీ.

"అమ్మాయి స్పృహలో లేదు. చివరి మాటలు వినే అదృష్టముగూడా లేదు నాయనా. కర్మ. దాన్ని కడుపు తీసేసుకోమని అంటావా? అనవసరంగా భయపడింది. ఎంత ధైర్యంగల పిల్ల! అది యిట్లా చేస్తుందని లేశమాత్రం నాకు తెలియదు నాయనా. ఆ డాక్టరు పిల్ల కమలట. ఆ అమ్మాయి ఏడుస్తూ కూర్చుంది తాను గూడా."

లీలను తలుచుకొని ఆమె ఏడుస్తూ ఉంటే నాకు కండ్ల వెంబడి నీళ్ళు వచ్చాయి. శాస్త్రి దిండులో తలదూర్చి ఒకటే రోదన. "శాస్త్రి గారూ, మీరుగూడా ఇట్లా ఏడిస్తే ఆమెను ఓదార్చేవారు ఎవ్వరు? చూడండి. అందరూ పోయేవారే కాస్త ముందూ వెనుకా. మన సంగతి చూడండి. మనమాత్రం శాశ్వతంగా ఉంటామా?" అని నాకు తోచిన నాలుగు ఉపశమన వాక్యాలు పలికాను. అంతకంటె ఒకరు మటుకు చేయగలిగింది ఏమిటి?

"కాదు, కృష్ణా! ఇది ఊహించలేని దారుణం. తట్టుకోలేను! వేదాంతం వట్టి నిరర్థకం. ఈ దుఃఖం అనుభవించటమే. గత్యంతరం లేదు. లేదు, కృష్ణా, లేదు." వాళ్ళ తిరిగి సాధారణ ప్రపంచంలోనికి వస్తారా అనే సంశయం గూడా కలిగింది నాకు. ఇక యిక్కడ ఉండి లాభం లేదని సెలవు తీసుకొని తిరిగి వచ్చాను.

ప్రపంచంలో ఈ చావు బ్రతుకులే సత్యాన్వేషణకు ముఖ్యంగా మార్గం చూపించేవి. సత్యాసత్యాల విమర్శలతో నాకు బుద్ధి స్పష్టత గూడా చలించింది. ఆశ్రమం దగ్గరకు వచ్చి కూడా నాలో నాకు, ఈ ఆశ్రమానికి ఉన్న బంధం విశదంగా గోచరించింది. దారి ఖర్చులు ఇచ్చిన శిష్యునిపై ప్రత్యేకాభిమానం ఏర్పడిన సత్యమూ ప్రత్యక్షమయింది. ప్రపంచంలో ఉంటూ బంధాలన్నీ తెంపాలన్నా తెగవు. అట్లా అనుకోవటమే ఒక అజ్ఞానం. అట్లా అనుకోకుండా ప్రపంచానుభవాలే సత్యం అనుకోవటం గూడా అజ్ఞానమే. ఆశ్రమంలో కూర్చొని, ఆకాశంలోనికి చూస్తూన్నాను. తిరిగి మౌనవ్రతం మొదలు. ఒక్కొక్కర్ని చేసంజ్ఞలతో పంపివేశాను.

ఒంటరిని. ప్రశాంతమయిన రాత్రి. జ్ఞానంలా వెన్నెల. ఈ దుఃఖం ఆద్యంతాలు ఊహించసాగాను. ఊహకు అందదు. బుద్ధుడు ఇదే పని చేశాడు. ఏమి ప్రయోజనం? ప్రపంచంలో దుఃఖం ఏమి తగ్గింది? జీసను? అతనూ అంతే. బలి అయిపోయారు. అనంతకాలంలో విలీనమయిపోయినారు. ఈ అన్వేషణకు అంతం ఉందా?

మరుసటి రోజు ఉదయం. పోస్టు జవాను ఒక పెద్ద పార్సెలు యిచ్చి వెళ్లాడు. చిన్న కవరు గూడా. ఇది ఏమిటా అని విప్పి చూచాను. ఆ

డి. నారాయణరావు




ఎంతో
రుచిగా ఉంటుంది
లాక్టవిటా

లాక్టవిటా ఎంతో రుచిగావుండే ఆదర్శమైన ఆహార పానీయం. ఇది పుష్టికరమైనదే కాక, ఆరోగ్యమును పెంపొందించి, హాయిగా నిద్రపట్టించును.




విటలోన్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్, మద్రాసు - 21



## మిల్క్ ఆఫ్ మెగ్నీసియా అంటే ఏమిటి?

**అది మెగ్నీసియం హైడ్రాక్సైడ్ యొక్క ఎమల్షన్—పిత్తమును అరికట్టి, విరోచనకారిగా పనిచేసి, సకల విధములగు గ్యాస్ట్రిక్ పరిస్థితులను మాన్పుటకు విరివిగా వాడబడుచున్న పదార్థము.**

మిల్క్ ఆఫ్ మెగ్నీసియాకు మెగ్నీసియం హైడ్రాక్సైడ్ మిక్చరు బి. పి., మెగ్నీసియా మాగ్మా యూ. ఎస్. పి., క్రీం ఆఫ్ మెగ్నీసియా బి. పి., మొదలగు పేర్లు గూడా ఉపయోగిస్తారు. దానికి ఏ పేరు పెట్టినా, అసలు పదార్థము ఒక్కటే. ఎల్లరు అంగీకరించే ఫార్మకోపియాలో విధించిన కఠిన సూత్రాలను, ప్రమాణాలను అనుసరించియే ఇది తయారుచేయబడుతుంది. వ్యాపార సరళి కొరకు ఒక పేరు పెట్టి మిల్క్ ఆఫ్ మెగ్నీసియాను అమ్మినప్పటికీ, ఆ వస్తువు నాణ్యత ఎంతమాత్రము తగ్గుట గాని, హెచ్చుటగాని జరుగదు. దానిని తయారుచేయువారిని గుర్తించుటకు మాత్రమే ఆ పేరు పనికొస్తుంది.

కాని, వాడుకదారుని మనస్తత్వము ప్రకారము ఈ వ్యాపార నామము నకు ముఖ్యత ఏర్పడుతుంది. ఏమంటే, ఎల్లరు మంచిదిగా ఎరిగిన పేరు దానిని తయారుచేయువారి నిజాయితీని గూర్చి వాడుకదారునికి వలసిన హామీ నిస్తుంది. అందువలననే లెక్కకు మిక్కుటమగు వాడుకదార్లు ప్రతిరోజు MandH మిల్క్ ఆఫ్ మెగ్నీషియాను కొంటున్నారు. అది యునైటెడ్ స్టేట్స్ ఫార్మకోపియాలోని సూత్రాల ననుసరించి తయారుచేయబడి, ఉత్పత్తివిధానంలో ప్రతిమెట్టు వద్ద దాని నాణ్యత కొరతపడకుండ పరీక్షింపబడి, స్వచ్ఛతలోను, పవిత్రతనములోను సంపూర్ణ దోషరహితముగ నుండుటయేకాక, అన్నిటి కన్న మిన్నగ, తదితర MandH ఫార్మస్యూటికల్ వస్తువులవలె ఔషధ క్షేత్రంలో ఏభై ఏండ్లకు పైగా గడించిన అనుభవము దీని నంటియుండుట తటస్థించినది.

మార్టిన్ అండ్ హారిస్ (ప్రై) లి.,
రిజిస్టర్డు ఆఫీసు : మర్కెంటైల్ బిల్డింగ్స్
లాల్‌బజార్ కలకత్తా-1.
బొంబాయి - న్యూఢిల్లీ - మద్రాసు. MP3


## పర్యవసానం

కవరును. దానిలో ఒక చిన్న ఉత్తరం.

"విజయవాడ.

కృష్ణగారికి. పార్సెలులోని కాగితాలు తమకు పంపమని డాక్టరు లీల చెప్పినారు కనుక పంపుతున్నాను.

ఇట్లు,
కమల."

కాగితాలు ఏమిటా అని చూస్తే అవి అన్నీ లీల డైరీలు; గడిచిన అయిదారు సంవత్సరాలవి. ఒక్కొక్క డైరీ పరిశీలించడం మొదలుపెట్టాను. ఎన్నో తెలియని సంగతులు తెలుసుకొన్నాను. కొన్ని కొన్ని భాగాలుమాత్రం చెబుతాను.

10—6—1955.

నాన్న ఇంటివద్ద లేడు. మూడు గంటలకే ఇంటికి తిరిగి వచ్చాను. డాక్టరు రఘు, అమ్మా పడకగదిలో...గిరుక్కున తిరిగి వెళ్లాను.

12—6—55.

అమ్మ విస్కీ బాగానే పుచ్చుకున్నది. అమ్మను నాన్న చీదరించుకున్నాడు.

15—6—55.

జీససు నవ్వుతున్నాడు (కలలో).

20—6—55.

కృష్ణుడు. నాతో సరసం చాలా ఆనందంగా ఉన్నది. (కలలో).

25—6—55.

ఫిలాసఫీ ప్రొఫెసరుగారు ఇచ్చిన సేక్రెడ్ డాక్ట్రిన్ చదివాను.

30—7—55.

మెడికలు కాలేజీలో చేరాను.

1—8—55.

నాన్న బీరువాలోని భాగవతం తీసి చదవటం ప్రారంభించాను.

10—8—55.

అమ్మా, నాన్నా వాదన. పాతివ్రత్యం వట్టి అర్థంలేనిదని అమ్మ వాదన. నాన్నలో ఛాదస్తం పోలేదు.

20—8—55.

బిసెంటు జీవిత విషయాలు అద్భుతం.

1—9—55.

హావలాక్ ఎల్లిసు రచనలు. చాలా ఒరిజనలు. నాన్న అవి చదవవద్దన్నారు. అయినా చదివి తీరతాను.

12—9—55.

టెన్నీసులో రఘు పరిచయం.

15—9—55.

రఘుతో షికారు.

17—9—55. రఘు నన్ను ప్రొఫెసరు రావుకు పరిచయం చేశాడు. రావు నన్ను కండ్లతోనే త్రాగేశాడు. అతని ఆవేశం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. నాలోని వేనిటీ టికిల్

అయిందేమో?

20—9—55.

రావు ఇంటికి ఆహ్వానించాడు. రావు బ్రహ్మాండంగా పాడుతాడు. అతనితో పడకగదిలో..... అనుభవం. అద్భుతం! ఆ అరగంట అతనే నా సర్వస్వం అనిపించింది. ఇప్పుడది ఏమీలేదు.

25—9—55.

రఘు దూర దూరంగా పోవటం చూచి నేనే పిలిచాను. వెకిలిగా మాట్లాడాడు. సిల్లీ ఫెలో అని అనుకున్నాను.

2—12—55.

పరీక్ష చదువులు ప్రారంభం.

10—4—56.

శ్యామల, సుందరరావును పరిచయం చేసింది. నిజంగా సుందరుడే.

10—5—56.

సుందరరావుతో సినిమా.

20—5—56.

డాక్టరు శేఖరుతో పరిచయం.

25—5—56.

సుందరరావుతో డాక్టరు శేఖర్ పోట్లాట.

1—6—56.

ఫ్రాయిడు సిద్ధాంతం — డాక్టరు రఘు, అమ్మ, నాన్న, డాక్టరు రావు, డాక్టరు శేఖర్ల చర్చ.

15—6—56.

వివేకానంద జీవితం చదువ ప్రారంభించాను.

18—6—56.

వివేకానంద అంత అందగాడు భర్త అయితే!

20—6—56.

శీలం లేని స్త్రీ — ఛీ — ఛీ—.

23—6—56.

శీలము వృథా. పురుషజాతి కల్పన. ప్రకృతిని అనుసరించితేనే మానవుల మనుగడ.

3—7—56.

శీలానికి ఎక్కువ ప్రాధాన్యం యివ్వని స్త్రీలందరు ప్రముఖులయినారు. కారణం?

15—7—56.

రామతీర్థుడు. వీడు. ఎవరూ? నేను ఎవర్ని?

7—9—56.

షేక్ మీరాతో రొమాన్సు. హిందూ ముస్లిం క్రిష్టియనులకు సమానత్వం ఒక సెక్సు విషయంలోనే.

11—10—56.

పరీక్షలలో క్లాసు రావాలంటే ఆడపిల్లలకు సులభమన్నాడు, క్లాసుమేటు శాస్త్రి. దాని నిజానిజాలు పరీక్ష చెయ్యాలి.

6—7—57.

అరవిందుని లైఫ్ డివైన్ ప్రారంభం. పాషాణపాకం.

9—9—57.

అరవిందుని పుస్తకాల పరిసమాప్తి. చాలా గొప్ప మేధావి. చాలా సూక్ష్మగ్రాహి. నిజమయిన తాత్వికుడు.

1—6—58.

నాకంటే మించిన పర్సనాలిటీ, అందం తనకు అగుపడలేదన్నాడు రావు. నీ కర్మ అన్నాను నేను.

1—7—58.

కృష్ణ అనే అబ్బాయి నాన్నకోసం వచ్చాడు. ఎన్నో జన్మలనుంచి పరిచయం ఉన్నట్లు....

1—8—58.

నా దేహాన్ని అన్ని కోణాలలో చూపినా కృష్ణ చెక్కు చెదరలేదు.

10—9—58.

కృష్ణను బలవంతంగా ముద్దు పెట్టుకున్నా. కాని —

తరువాత డైరీలనిండా నాపేరే. నేను ఎంత దూరమయితే, అంత నా సంగతే తలుచుకుంటున్నది.

10—10—58.

ఇంగ్లీషు నవలాప్రపంచంలో పడ్డాను.

12—10—58.

నన్ను అనుభవించానని అనుకునే మూర్ఖులు ఇరవైమంది. కాని వాళ్లకు ఇరవైమందిని నేను అనుభవించానని తెలియదు.

15—10—58.

ఫ్రెంచి నవలలు నచ్చాయి. ఎమిలీజోలా సూపెర్బ్.

25—10—58.

చలం నవలలు తెప్పించుకొని చదివాను. క్రొత్త విధానం, క్రొత్త పోకడలు — నాలాంటి వాళ్లనే దృష్టిలో పెట్టుకొన్నట్లు ఉన్నది.

26—10—58.

విశ్వనాథవారు పాతచింతకాయ. మేధావి.

30—6—59.

ఓల్డు టెస్టమెంటు పరీక్ష ప్యాసు అయినాను. కంగ్రాచ్యులేషన్సు.

5—9—59.

డాక్టరు శేఖరుతో చర్చ. మాడరన్ మెథడ్సు చాలా ఉంటే సెక్సు విషయాల్లో సంకోచం ఎందుకు?

10—7—59.

ఇతరులకు అపకారం చేస్తే పాపం కాని దేవుడిచ్చిన శరీరంతో సుఖం అనుభవిస్తే పాపం ఏమిటి? వీళ్ల ముఖము.

15—7—59.

వివాహాలు, చుట్టరికాలు మానవనిర్మితం. ప్రకృతిలో వీటికి స్థానం లేదు. తండ్రి, సోదరుడు, కొడుకు — అనే విచక్షణ సమాజం పెట్టింది. నైసర్గికమయినది గాదు.

10—8—59.

చంద్రం భార్య పోయింది. ఓదార్చటానికి వెళ్లితే పది రోజులు అతనితో ఉండిపోవలసి వచ్చింది.

14—10—59.

చంద్రం పెళ్లి చేసుకోమంటాడు. నాకు పెళ్లి ఏమిటి?

16—10—59.

నాకు కృష్ణ కావాలి. కాని మా మధ్య దూరం అనంతం.

25—10—59.

కమలను చూడాలి. అది పవిత్రత, నేను అపవిత్రత. ఛీ—ఛీ—దానికి ధైర్యంలేదు. కాదు. నిజంగా దాని స్వభావం వేరు.

26—10—59.

ఏదో పాడు పని చెయ్యాలి; తోచడం లేదు.

29—10—59.

శ్యామసుందరరావు తనతో లేచిరమ్మంటున్నాడు. ఒక నెల తిరిగి వస్తే....

7—11—59.

మేజరు వెంకటరావు కాక్‌టెయిల్ పార్టీ



భీత హరిణేక్షణ

చిత్రం—గోలి నాగేశ్వరరావు (హైదరాబాదు)

ఇచ్చాడు. నిషాలోని మజా తెలిసింది.

12—11—59.

విజయవాడ వెళ్లి కమలను చూడాలి. అదొక పిచ్చిది కాని; అంత అందమయినది ఎట్లా తట్టుకోగలిగిందా ఈ మగవాళ్ల తాకిడి? ఆడది అలుసు యివ్వకపోతే ఏ మగాడూ ముందుకు రాడు.

15—11—59.

శ్యామసుందరునితో రేపు లేచిపోటానికి నిశ్చయించాను. అమ్మకు చెప్పి వెళ్లితే? చెప్పితే సరదా లేదు. లేచిపోవటంలోని అనుభవం కావద్దూ—

డయిరీలు ఒక్కొక్కటే నిప్పులో వేశాను. అవి కాలుతూ ఉంటే లీల ఒక్కొక అంగం అగ్నికి ఆహుతి ఇస్తున్నట్లున్నది. రాత్రి పది గంటలు దాటింది. ఆశ్రమంలో ఒంటరిగా ఉండటం బాగా అలవాటు అయింది. కాని ఆ రోజు ఎందుకో అదోరకం తోడుకోసం తహ తహ

# పర్యవసానం

లాడిపొయ్యాను. నేను యోగినా, కాను. సన్యాసినా, కాను. జ్ఞానినా, కాను. నిజంగా చచ్చిన తరువాత ప్రాణి ఏమవుతుంది? రాయ్, మూర్ఖ్స్ వాళ్ళు చెప్పిందే నిజమేను! ఇంతలో ఒక శబ్దం వినబడసాగింది. మంచుతెరలాగా, ఒక మేఘం లాగా ముందు గోచరించింది. కృష్ణా అన్నట్లు పిలుపు. చుట్టూ కలయచూశాను. ఎదురుగా తెల్లని ఆకారం నిల్చుని ఉన్నది. లీలవా అన్నట్లు చూశాను. అవునన్నట్లు తల ఊపింది. ఇంతలోకే ఆశ్రమం ముందు చిన్న కారు ఆగింది. కారులోనుంచి ఒక స్త్రీ దిగింది. సామాను లోపలపెట్టి డ్రయివరు కారు ఎదురుగా ఉన్న చెట్టు క్రింద ఉంచి బీడీ తాగటం మొదలు పెట్టినాడు. ఆమె సరాసరి నా దగ్గరికి వచ్చి నిలబడి "నన్ను గుర్తుపట్టావా?" అంది. "ఆహా!" అన్నాను. నన్ను బలవంతంగా కౌగలించుకొని వదలకుండా పెనవేసుకుపోయింది. వదిలించుకొని నెమ్మదిగా మంచంమీద పడుకోబెట్టి ప్రక్కన కూర్చుని ఆలోచించసాగాను— నిద్రపోయింది. ఎవరీమె? జ్ఞాపకం వచ్చింది— కమల. ఈమెలో ఉన్నది కమలా? లీలా?

తెల్లవారేసరికి ఆమె లేచి కూర్చుంది.

"డ్రైవర్" అని కేక వేసింది. డ్రైవరు వచ్చాడు.

"ఇక్కడ ఉన్నానేమి?" అని అన్నది.

"మీరేకదండీ, అర్జంటుగా బయలుదేరి ఆశ్రమానికివెళ్ళాలన్నారు? అట్లా మాట్లాడుతారేమండి?"

డ్రైవరు సమాధానము విని ఆమె క్షణకాలం గతం స్ఫృహలోనికి తెచ్చుకోసాగింది. "సరేలే. కృష్ణాగారు ఉన్నారా?" అని అడిగింది.

నేను ఎదురుగా వచ్చి కూర్చున్నాను. ఆమె ఏదో చెప్పాలనుకున్నది. కాని చెప్పలేదు. ఆమె బాధ చూశాను. నేనే ప్రశ్నించాను. "ఇక్కడికి ఎందుకు వచ్చారు? నేను తెలుసుకోవచ్చా?" అని చీటీమీద వ్రాసి ఇచ్చాను.

"మీకోసం" అని అంది.

"ఇదివరకు పరిచయం మనకు లేదనుకుంటాను."

చీటీమీద నాకు జవాబు ఇచ్చింది. "లేదు. నిజమే. నాకు మీరు లేనిదే శాంతి లేదు. లీల నా స్నేహితురాలు. నా చేతులమీదుగానే చనిపోయింది. అది చనిపోవడానికి నా అశక్తతే కారణం. లీల మిమ్మలను ప్రేమించింది. ప్రేమించని వ్యక్తులెందరితోనో ఆమెకు సాంగత్యం ఉంది. కాని మీరుమాత్రం దూరస్థులుగానే ఉండిపొయ్యారు. చివరి గడియల్లోగూడా మిమ్మలను తలుస్తూనే ప్రాణం విడిచింది. నన్ను లీల ఆవేశిస్తూ ఉంది. అప్పుడు నన్ను నేను సంబాళించుకోలేను. నాకు నామీద కంట్రోలు లేదు. నేను బ్రహ్మచారిణిని. నాకు ఇంతవరకు పురుష సాంగత్యం అంటే తెలియదు. కాని లీల నన్ను ఆవేశించినప్పుడల్లా ఉద్రిక్తురాల నవుతున్నాను. ఎవరో మంత్రవేత్తలు నన్ను బాగుచేయడానికి ప్రయత్నించారు. కాని, వాళ్లకు సాధ్యం కాలేదు. మీరు తప్ప నాకు గత్యంతరం లేదు. ఈ ప్రాణిని మీరు కనికరించాలి."

ఆమె మంచం దిగి నా కాళ్ల దగ్గరకు చేరింది. నా కాళ్లను ఆమె రొమ్ములకు ఆనించుకొని కళ్లనీళ్లతో కడుగుతున్నది. నేను అట్లా నిశ్చేష్టుడయినాను. ఆమె మహా సౌందర్యవతి. "ఆలోచించుకోనివ్వు" అని చీటీమీద వ్రాసి ఇచ్చాను. నా సాధనకు స్వస్తిచెప్పి, ఈమెతో సంసారం చెయ్యటమా లేక ఈమెను వదలించుకోవటమా? నేను వదలినా లీల వదలదు గదా! మరుసటిరోజు గూడా కమలను అక్కడనే ఉండమన్నాను. ఇంతకూ చనిపోయిన లీల రుజువుచేసిన సత్యం ఒక్కటి — "దేహం పోయినా జీవి పోదు" అని లీల కమలను ఆవేశించటం నిజమా? భ్రమా? లేక, కమల నాటకమా? కమలకు ఈ నాటకం ఆడవలసిన అవసరం లేదే?

ఇది ఆలోచించి తిరిగి గదిలోనికి వచ్చేటప్పటికి కమల 'ఫిట్సు' వచ్చినట్లు పడిపోయింది. దగ్గరకు వెళ్లి కూర్చున్నాను. "కృష్ణా" అని పిలిచింది. అది లీల పిలుపే. కాని పిలిచింది కమల. "నీ తలకాయ మౌనం! ఇన్నాళ్లుమిడికావు. ఏమన్నా వచ్చిందీ? ఆధ్యాత్మిక జ్ఞానానికి అడవులు, ఆశ్రమాలు ఎందుకోయ్? నేను జారిణినే అని అనుకో. నాకంటే నీకు అధిక జ్ఞానం ఏముంది? ప్రకృతి పురుషులు ఒకరికి ఒకరు ఉన్నారు. ఇది దైవసంకల్పం. ఈమె నీకోసం పుట్టింది. ఈమె తోడయితేనే నీకు పూర్ణత్వం. నా కోరికా నెరవేరుతుంది."

నిజంగా కన్ను తెరిచినట్లు అయింది. ఆమె లేచింది. గాఢంగా కౌగలించుకొంది. నా పెదవులను ముద్దాడింది. నాలో నిద్రాణమయిన కామం విజృంభించింది. విచక్షణజ్ఞానం మందగించింది. ఉద్రేకంతో ఆ సర్వాంగసుందరిని ఆ కమలను, నా సర్వస్వంగా వాడుకొన్నాను. నేను అప్పుడు ఆమెను లీలగానే చూచాను. నాది మానసిక వ్యభిచారమని అనుకుంటా. అంతటితో నా బ్రహ్మచర్యం గంగలో కలిసింది. కర్రలతో బయట నిలుచున్న భక్తులకు "మేము వెళ్లిపోతున్నాము. ఆశ్రమం మూసివేశాము" అని చెప్పవలసివచ్చేవరకు మౌనమూ ఎగిరిపోయింది. కొందరు భక్తితో నమస్కరించారు. కొందరు వెక్కిరింపుగా చూశారు. అంతటితో నా ఆశ్రమానికి స్వస్తి.



తల్లి ఒడిలో

చిత్రం—జి. లక్ష్మీనారాయణ (సంగారెడ్డి)

హైదరాబాదుకు మకాం మార్చాము. కమల డాక్టరు ప్రాక్టీసు మానివేసింది. నేను లాయరుగా ప్రాక్టీసు మొదలుపెట్టాను. లీల సంగతి అప్పుడప్పుడు జ్ఞాపకం వస్తుండేది. కమల వద్దని చెప్పినా వినలేదుట లీల; మూడవసారట అట్లా కడుపు తీసుకోవటం. చాల ప్రమాద మన్నమాట గ్రహించికూడా లీల అట్లా చేసిందంటే, ఆమెను మెచ్చుకోవాలో, తిట్టాలో అర్థం కాలేదు నాకు. కమలకు మరీ పూజలు, వ్రతాలు ఎక్కువైనాయి. ఇంత చదువుకున్న దానిలోకూడ ఏమిటీ చాదస్తం అనుకొన్నాను. వచ్చిన సన్యాసినల్లా భిక్షకు పిలువమంటుంది. "ఎవరో స్వాములవారు వచ్చారు" అని చెప్పింది కమల. "భిక్షకు పిలుద్దామా?" అంది. "సరే" నని కారులో బయలుదేరాను నల్లకుంట శంకర మఠం దగ్గరకు. స్వాములవారు అనర్గళంగా మాట్లాడుతున్నారు. ఆశ్రమ ధర్మాలు, కైవల్యసిద్ధులను గురించి బహు రమ్యంగా ఉపన్యసించారు. ఉపన్యాసానంతరము "స్వామీ, మీరు మా యింటికి భిక్షకు దయచేయాలి" అని ప్రార్థించింది కమల. "సరే నమ్మా!" అంటూ నావైపు చూశారు. నేనూ బిత్తరపోయినాను.

"శాస్త్రిగారూ" అన్నాను.

"కృష్ణా, నీ ఆశ్రమం?" అన్నారు.

"అన్నీ వదలిపోయాయి. కమలను పెండ్లి చేసుకున్నాను. ఇక్కడే సంసారం. స్వామీజీ, నేను అటునుంచి యిటు వస్తే, తమరు ఇటు నుంచి అటు పోతున్నట్లుంది."

"మీ భార్య?" అని అడిగింది కమల.

"దుఃఖ నివారణకొరకు మేరీ పూర్తిగా త్రాగటం మొదలుపెట్టింది. లీల చావుతో మా సంబంధంకూడ తెగిపోయింది, నాయనా. ఇక సెలవు. ప్రాణహానికి బాధ్యుణ్ణి కాకపోయినా నేను పాపిని. పాపక్షాళనం చేసుకోవాలి. సెలవు. అమ్మా, సెలవు."

విషాదమంతా రూపుదాల్చి పోతున్నట్లుంది స్వాములవారు వెళ్తూ ఉంటే. కమల దిగులుగా నిలబడి చూస్తూ ఉన్నది. అది ఆత్మఘోష. లీల — ఆమె ఒక సమన్వయం కాని సంస్కృతీ మిశ్రమానికి ప్రతిబింబం. కమల నావైపు చూసింది. ఆ చూపులో శాంతి ఉంది. కాని లీల చూపులోని తీవ్రత ఏదీ? ★